

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 37.0
కనిష్ఠం: 28.0



నరసాపురం లేస్‌కు జాతీయ పురస్కారం

వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్‌కు ఎంపిక

నేడు ఢిల్లీలో అవార్డు అందుకోనున్న కలెక్టర్

నరసాపురం/భీమవరం టౌన్, జూలై13(ఆంధ్రజ్యోతి): నరసాపురం లేస్ ఉత్పత్తులకు అరుదైన గుర్తింపు లభించింది. ఇప్పటికే దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉన్న లేస్‌కు కేంద్ర ప్రభుత్వం ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఒన్ డిస్ట్రిక్ ఒన్ ప్రోడక్ట్) అవార్డు ప్రకటించింది. 2024-25 సంవత్సరానికి నరసాపురం అల్లికకు గుర్తింపు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లాల ఉత్పత్తులు పోటీపడగా 7 జిల్లాల ఉత్పత్తులను ఎంపిక చేయగా నరసాపురం లేస్ అల్లికలు ప్రథమంగా ఎంపికయ్యాయి. ఢిల్లీ ప్రగతి మైదానంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి నుంచి జిల్లా కలెక్టర్ నాగరాణి సోమవారం అవార్డును అందుకోనున్నారు. గతంలో నరసాపురం లేస్ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపు లభించింది. తాజాగా జాతీయ స్థాయిలో మరో అవార్డు దక్కడం గమనార్హం. కూటమి ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ లేస్ పార్కుపై ప్రత్యేక దృష్టి సారించారు. తరచూ పార్కును సందర్శించి మహిళలతో సమావేశమవుతున్నారు. కొత్త డిజైన్లు, అల్లికలపై శిక్షణ గురించి ఆరా తీయడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాన్ని కూడా ప్రోత్సహిస్తున్నారు.

జిల్లాలో నవ్వుల కోట
సినీ నటుడు కోట శ్రీనివాసరావుతో అనుబంధం

పుష్కరాలకు ఏమేం కావాలి ?
అధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష

ఎంపీఈవోలకు రెన్యువల్ కష్టాలు
నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్
7

వరద గోదారి


ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు


కనకాయలంక కాజ్‌వే పై వరద నీటిలో రాకపోకలు

ధవళేశ్వరం వద్ద తగ్గిన గోదావరి ఉధృతి

సముద్రంలోకి 6,14,762 క్యూసెక్కుల నీరు విడుదల

సిద్ధాంతం, పెదమల్లం, కోడేరు లంకలకు వరద నీరు

నీట మునిగిన కనకాయలంక కాజ్‌వే


సిద్ధాంతంలో నీట మునిగిన కేదారేశ్వర్ ఘాట్

ధవళేశ్వరం/పెనుగొండ/ఆచంట/యలమంచిలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న గోదావరి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగి ఆపై తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయానికి అత్యధికంగా 6,56,341 క్యూసెక్కుల నీటిని కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులు నమోదైంది. సాయంత్రానికి 40 వేల క్యూసెక్కులకు పైగా తగ్గి 6,14,762 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద 24గంటల వ్యవధిలో 10 అడుగుల తగ్గిన నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 30.60 అడుగులకు చేరుకుంది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4,800క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6800క్యూసెక్కులు చొప్పున నీరు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి విడుదల స్వల్పంగా తగ్గినప్పటికీ సిద్ధాంతం, ఆచంట, యలమంచిలి వద్ద గోదావరి ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. పెనుగొండ మండలం సిద్ధాంతం మధ్య లంకలో నీరు చేరుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సిద్ధాంతం మధ్య లంక రైతులు జాగ్రత్త వహించాలని తహసీల్దార్ జి.అనితకుమారి సూచించారు. ఆదివారం సాయంత్రానికి సిద్ధాంతం వశిష్ట గోదావరి వద్ద కేదార్‌ఘాట్ మెట్లు, పక్కనే శివలింగం వరద నీటిలో మునిగిపోయింది. ఆచంట మండలంలో లంక గ్రామాలకు పడవలపై రాకపోకలు తగ్గించారు. రెవెన్యూ అధికారులు గోదావరి వరద పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం వరదతో ముప్పు లేదని, ఏటిగట్టు పటిష్టంగా ఉందని ఇరిగేషన్ హెడ్ వర్క్స్ ఏఈ జి.పవన్ కుమార్ తెలిపారు.

ఎగువన శాంతించిన గోదావరి

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): గోదావరి కొంచెం శాంతించింది. ఏజెన్సీ వాసుల్లో ముంపు భయం వీడింది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. గొమ్ముగూడెం గ్రామస్థులంతా దాచారం పునరావాస కాలనీలో ఉన్నారు. గోదావరి తగ్గుముఖం పట్టినప్పటికి గోదావరి తీరం వైపు ఎవరూ వెళ్లకుండా కుక్కునూరు పోలీసులు కంచెను ఏర్పాటు చేశారు. పోలవరం ప్రాజెక్ట్ సాయంత్రానికి గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గింది. పట్టిసీమ శివక్షేత్రం వద్ద వరద జలాలు చుట్టుముట్టాయి, గోదావరి లంక భూములు నీట మునిగాయి. కడెమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు మూసివేశారు.


ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి వరద ప్రవాహం

నీటమునిగిన కనకాయలంక కాజ్ వే

గోదావరి వరద ప్రవాహం పెరగడంతో యలమంచిలి మండలం కనకాయలంక కాజ్ వే నీటమునిగింది. కాజ్‌వేపై సుమారు ఒకఅడుగు వరదనీరు ప్రవహిస్తోంది. కనకాయలంక - డాక్టర్ డీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా చాకలిపాలెం మధ్య వరదనీటిలోనే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. కాజ్ వే పూర్తిగా నీటమునిగితే పడవలపైనే రాకపోకలు సాగించాలి.

అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో దాసి రాజు

గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా అధికారులు, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు సూచించారు. కనకాయలంక కాజ్ వే వద్ద వరద పరిస్థితిని ఆదివారం ఆయన పరిశీలించారు. లంక గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామన్నారు.

అన్నదాత సుఖీభవ అర్హులు 1,02,320


(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- జాబితా సిద్ధం చేసిన అధికారులు
- మరో 800 అభ్యంతరాలు
- పరిశీలన అనంతరం లబ్ధి
- తొలి విడత రూ.7 వేలు జమ

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా సిద్ధమైంది. అనర్హుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలో 800 మంది రైతు సేవా కేంద్రాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు వాటిని పరిశీలించి అర్హత ఉంటే జాబితాలో చేర్చనున్నారు. రైతులకు అప్‌లోడ్ చేసిన యాప్‌లో అర్హతను పరిశీలించుకునేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో వరి, ఉద్యాన పంటల రైతులు దాదాపు 1,15,000 మందికి 1,05,000 మంది రైతులు అర్హుల జాబితాలో ఉన్నారు. రైతు సేవా కేంద్రాల్లో అర్హులను కూడా పరిశీలించారు. మొత్తంపైన 1,02,320 మంది రైతులు ఉన్నట్టు గుర్తించారు. మరో 326 మంది రైతులు ఇతర ప్రాంతాల్లో ఉన్నారు. అందుబాటులో లేకపోవడంతో వారికోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉండడంతో రైతు సేవా కేంద్రాలకు రాలేకపోతున్నారు. వారికి అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ అయ్యే అవకాశం లేదు. ఇప్పటివరకు గుర్తించిన రైతులందరికీ త్వరలోనే తొలి విడత సుఖీభవ సొమ్ములను జమ చేయనుంది.

సూపర్ సిక్స్‌లో మరో హామీ

రైతులకు అన్నదాత సుఖీభవలో ఏటా రూ.20వేలు అందించనున్నట్టు ఎన్నికల్లో కూటమి ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తోంది. అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 14 వేలు కలిపి ఇవ్వనుంది. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలో అన్నదాత సుఖీభవ ఒకటి. మూడు విడతల్లో సొమ్ము జమచేయనుంది. కేంద్రం మూడు విడతల్లో రూ. 6వేలు రైతు ఖాతాలో జమ చేస్తోంది. ఒక్కో విడత రూ.2 వేలు ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా 3 విడతల్లో ఇవ్వాలని నిర్ణయించింది. కేంద్రం ఇచ్చే రూ.2 వేలతో కలుపుకొని తొలి విడత రూ. 7 వేలు రైతు ఖాతాలో జమ చేస్తారు. మలి విడత మరో రూ.7వేలు, మూడో విడతలో రూ.6వేలు ఇవ్వాలని సంకల్పించింది. ఏడాదికి రూ.20 వేలు రైతు ఖాతాలో జమ చేసి సూపర్ సిక్స్‌లో మరో హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది.

పండుగొప్ప

ఆక్వా రైతులకు సిరుల పంట

- సముద్ర తీరంలో వెయ్యి ఎకరాల్లో సాగు
- హౌరా మార్కెట్‌కు ఎగుమతి
- 4 కిలోల చేప కిలోకు రూ.430



పండుగప్ప... ఎట్టకేలకు మార్కెట్ ధర పెరిగింది. ప్రస్తుతం 4 కిలోల చేప కిలో ధర రూ.430 ఉంది. 15రోజులుగా కిలో ధర రూ.370 నుంచి రూ.430 వరకు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ధర ఎంతకాలం ఉంటుందోనని భయం వారిని వెన్నాడుతోంది. పశ్చిమ గోదావరి, మచిలీపట్నం సముద్ర తీర ప్రాంతంలో వెయ్యి ఎకరాల్లో పండుగప్ప సాగు చేస్తున్నారు. ఇక్కడి నుంచి హౌరా మార్కెట్‌కు ఎగుమతి అవుతోంది. ఇదే ధర కొన్ని రోజులు కొనసాగితే రైతుకు లాభాల పంటే..

ఆకివీడు రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆక్వా సాగులో పండుగప్ప రైతులకు సిరులు కురిపిస్తోంది. మార్కెట్‌లో ప్రస్తుత ధర లాభదాయకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా రైతులు కట్లా, రోహూ (శీలావతి), గడ్డిచేప, మోసు వంటి రకాలు ఎక్కువగా చేస్తారు. కొంతమంది రైతులు పండుగొప్ప సాగు చేపట్టారు. దీనినే పండు చేప అని పిలుస్తారు. ఇది మాంసాహార చేప, బతికున్న, చనిపోయిన చేపలు, కప్పలు, జీవాలను తిని పెరుగుతుంది. మంచినీరు, ఉప్పునీరులో జీవించే పండు చేప ఏరు, సముద్రంలో ఉంటుంది. ప్రస్తుతం సముద్ర తీర ప్రాంతంలో చెరువులో సాగు చేస్తున్నారు. పశ్చిమగోదావరి, మచిలీపట్నం సముద్ర తీరప్రాంత గ్రామాలలో సుమారు వెయ్యి ఎకరాలలో సాగవుతోంది. సాగుకు 14 నుంచి 15 నెలలు సమయం పడుతుంది. సరాసరి 4కిలోల వచ్చే వరకు చేపను పెంచుతారు. టన్ను చేప ఉత్పత్తికి 7టన్నుల మేత ఖర్చు అవుతుంది.

ధర ఆశాజనకం

ప్రస్తుతం 4కిలోల చేప కిలో ధర రూ.430 ఉంది. 15రోజులుగా కిలో ధర రూ.370 నుంచి రూ.430 వరకు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ధర ఎంతకాలం ఉంటుందోనని భయం వారిని వెన్నాడుతోంది. ప్రస్తుత ధర స్థిరంగా ఉంటే రైతులు ఊరట చెందుతారని చెబుతున్నారు. రెండేళ్ల మార్కెట్‌ను పరిశీలిస్తే ప్రస్తుతం ఉన్న ధర గరిష్ఠ ధర అని రైతులు చెబుతున్నారు. హౌరా మార్కెట్ పండు చేపకు మంచి మార్కెట్. నరసాపురం, లోసరి, బందరు ప్రాంతాలలో కొనుగోలు చేసి బెంగాల్ ఎగుమతి చేస్తున్నారు. కేరళ, ఉత్తరప్రదేశ్‌కు కిలో సైజు చేపలు ఎగుమతి అవుతున్నాయి. కిలో బరువున్న చేపలకు 8 నుంచి 10 నెలలు సమయం పడుతుంది, ధరతో పోలిస్తే 4కిలోల చేపకు మధ్య వ్యత్యాసం రూ. 50 వరకు ఉంటుంది. 2కిలోల తరువాతే చేప వేగంగా పెరుగుతుంది. దీనితో రైతు సరాసరి 4కిలోల వరకు చేపలను పెంచుతారు.

నాణ్యమైన సీడ్ కీలకం

పండుగప్ప సాగుకు నాణ్యమైన సీడ్ కీలకం. ముత్యాలపల్లిలో హేచరీ ద్వారా సీడ్ ఉత్పత్తి అవుతున్నది. చెరువులో సాగు చెయ్యడానికి 80 గ్రాములు పిల్ల నుంచి 100 గ్రాములు పిల్లను ఎంచుకుంటారు. పిల్ల బరువును బట్టి ధర రూ.100 - 120 పలుకుతుంది. చెరువు లోతును బట్టి ఎకరాకు 2 వేల నుంచి 4వేల పిల్లలను వేస్తున్నారు.

మేతలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రస్తుతం పండుగప్ప చేపకు గొరక, సముద్రం చేపలు మాత్రమే ఆహారంగా ఉపయోగిస్తున్నారు. మార్కెట్‌లో లభించే చైనా గొరక, లేదా సముద్రం చేపలను కొనుగోలు చేసి వాటిని ముక్కలుగా చేసి ఆహారంగా ఇస్తున్నారు. టన్ను చేప దిగుబడికి 7టన్నుల గొరక లేదా సముద్రం చేప ఆహారంగా అందించాలి. గొరక కిలో రూ.32 నుంచి రూ.35 వరకు ధర పలుకుతున్నది. వీటిని ప్రాసెసింగ్ చేసి ఆహారంగా వేస్తారు.

మిగతా 8వ పేజీలో..

డిజిటల్ లక్ష్మి వస్తోంది..

- డిజిటల్ లక్ష్మి ఎంపికకు చర్యలు
- నిబంధనలు విడుదల చేసిన ప్రభుత్వం
- త్వరలో పట్టణాల్లో డిజి లక్ష్మి కేంద్రాలు



పట్టణాల్లోని స్వయం సహాయ సంఘాల్లో డిగ్రీ విద్యార్హత ఉన్న మహిళలు ఇక డిజిటల్ లక్ష్మి కానున్నారు. మహిళలకు ఆర్థిక భరోసా అందించేందుకు ప్రభుత్వం డిజిటల్ లక్ష్మి పథకం అమలుకు కార్యాచరణ రూపొందించింది. మెప్మా అధికారులు మహిళా సంఘాలకు డిజిటల్ లక్ష్మిపై అవగాహన కల్పించడంతోపాటు అర్హుల ఎంపికకు కసరత్తు పూర్తిచేశారు. మహిళా సంఘాలు కూడా ఆమోదించాల్సి ఉంటుంది.

భీమవరంటౌన్ జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 250 రకాల సేవలు అందించడానికి డిజి లక్ష్మి పేరిట రాష్ట్ర ప్రభుత్వం పథకం రూపొందించింది. స్వయం సహాయక సంఘ మహిళలను ఎంపిక చేసి సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. జిల్లాలో 300 సాధారణ సేవా కేంద్రాలు (కామన్ సర్వీస్ సెంటర్లు-సీఎస్సీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్వయం సహాయక సంఘాల నుంచి అర్హులను ఎంపిక చేసేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)కు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. నియమ నిబంధనలు, అర్హతలు పేర్కొంటూ జీవో విడుదల చెయ్యడంతో పాటు కచ్చితంగా అమలు చెయ్యాలని ఆదేశాలు జారీ చేసింది.

మీ సేవా కేంద్రాల తరహాలో..

వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణతోపాటు మీ సేవా కేంద్రాల తరహాలో ఈ కేంద్రాల్లో పలు సేవలు అందిస్తారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడంతో పాటు మహిళలకు ఉపాధి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే మునిసిపాల్టీల వారీగా దరఖాస్తులను స్వీకరించారు.

మిగతా 8వ పేజీలో..

జిల్లాలో వడివడిగా.. తొలి అడుగు



తెలుగు తమ్ముళ్లు దూకుడు పెంచారు. సుపరిపాలన ప్రజలకు వివరించడానికి తొలి అడుగు జిల్లాలో వడివడిగా పడుతోంది. ఇంటింటికీ వెళుతున్న తెలుగుదేశం పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు ప్రజలతో మమేకం అవుతున్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల స్పందనను తెలుసుకుంటున్నారు. సానుకూలంగా స్పందిస్తుండడంతో కేడర్‌లో జోష్ నెలకొంది. నేతల్లోనూ ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రభుత్వంపై జనంలో సానుకూలత ఉందంటూ తెలుగుదేశం నేతలు సంతృప్తి చెందుతున్నారు.

- ఇంటింటికి వెళుతున్న తెలుగు తమ్ముళ్లు
- ప్రజలతో మమేకమవుతున్న నేతలు
- సంతృప్తి, సమస్యలపై యాప్‌లో అప్‌లోడ్
- జనం నుంచి సానుకూల స్పందన
- ఇంటింటా సర్వేలో పాలకొల్లు ఫస్ట్
- నాలుగు నియోజకవర్గాల్లో వెనకబాటు

నియోజకర్గం	ఇళ్లు	తిరిగిన ఇళ్లు
పాలకొల్లు	64,628	38,213
తణుకు	77,234	16,679
తాడేపల్లిగూడెం	70,340	14,064
నరసాపురం	55,984	5,897
భీమవరం	82,950	5,406
ఆచంట	59,367	4,786
ఉండి	74,085	4,160

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సుపరిపాలనలో తొలిఅడుగు పేరిట తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఉత్సాహంగా జనం మధ్యకు వెళుతున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నేతలు, కార్యకర్తలు ఇంటింటికి వెళుతున్నారు. ప్రజల నుంచి వివరాల సేకరణలో పాలకొల్లు నియోకవర్గం ముందంజలో ఉంది. మంత్రి నిమ్మల రామానాయుడు వీలు దొరికినప్పుడల్లా జనంలో ఉంటున్నారు. ప్రతి గ్రామంలో కేడర్ ఇంటింటికి వెళ్లేలా ప్రణాళిక చేశారు. భీమవరంలో పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారమలక్ష్మితో సహా నాయకులంతా ప్రజల్లోకి వెళుతున్నారు. ప్రభుత్వంపై సానుకూలత ప్రదర్శిస్తున్నారంటూ నియోజకవర్గంలో కేడర్ మంచి జోష్‌తో ఉంది. తణుకులో ఎమ్మెల్యే రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం, నరసాపురంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు వలవల బాబ్జి, పొత్తూరి రామరాజు పర్యటిస్తున్నారు. ప్రజల నుంచి వివరాల సేకరణలో తణుకు రెండో స్థానంలో ఉంటే, తాడేపల్లిగూడెం మూడో స్థానంలో నిలచింది. ఉండి నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ తనయుడు భరత్, ఆచంటలో ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ నియోకజవర్గాల్లో పర్యటిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు వెళ్లి పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి మంచి మార్కులే లభిస్తున్నాయి. తల్లికి వందనం పథకం అమలుపై జనంలో పూర్తి స్థాయి సంతృప్తి ఉందని నేతలు చెబబుతున్నారు. అభివృద్ధిపైనా సానుకూల మార్కులే పడుతున్నాయి. మంచి పాలన అందిస్తున్నారని జనం కితాబుతో నేతల్లో ఆనందానికి అవధులు లేవు.

నాలుగు చోట్ల వేగం పెంచాలి..

ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలవడంలో 3 నియోజకవర్గాలు ముందున్నా మిగిలిన చోట్ల వేగం పెంచాలి. తొలి అడుగు వేగం పెరగాలని నియోజకవర్గ బాధ్యులకు అధిష్ఠానం ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తోంది. జిల్లాలో తక్కువ వివరాలు అప్‌లోడ్ చేసిన భీమవరం, ఆచంట, నరసాపురం, ఉండి నియోజకవర్గాల్లో తక్షణం కాస్త దూకుడు పెంచాలని అధిష్ఠానం సూచనలు చేస్తోంది.

దిగి వస్తున్న అపరాలు

నిలకడగా ఉల్లి, కూరగాయల ధరలు



తాడేపల్లిగూడెం, జూలై 13(ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో అపరాల ధరలు దిగి వస్తున్నాయి. గత సంవత్సరంలో పోల్చుకుంటే కిలోకు రూ.40 తగ్గాయి. ప్రధానంగా కంది పప్పుధరలు పోల్చుకుంటే కిలో రూ.95 నుంచి 105 వరకు ధర ఉంది. మొదటి రకం కందిపప్పు రూ.105కు విక్రయి స్తున్నారు. ఇదే రకం కందిపప్పు గతేడాది కిలో రూ.160 వరకు వెళ్లింది. మిన ప్పప్పు కూడా ప్రస్తుతం రూ.80 నుంచి 100 మధ్య విక్రయిస్తున్నారు. గత సంవత్సరం రూ.125 వరకు విక్రయాలు జరిగాయి. పెసరపప్పు రూ.95, పచ్చి శనగపప్పు రూ.75కు అమ్ముతున్నారు. మొన్నటివరకు ఇది కిలో రూ.85 అమ్మే వారు. ఇలా చూస్తే దాదాపు అపరాలు ధరలు తగ్గాయి.

నిలకడగా కూరగాయల ధరలు :

కూరగాయల ధరలు నిలకడగానే ఉన్నాయి. గత వారంతో పోల్చుకుంటే ధరల్లో వ్యత్యాసం లేదు. తెల్లవంకాయలు రూ.80, నల్లవి రూ.60, గోరు చిక్కుడు రూ.60, దోస రూ.40కి విక్రయిస్తున్నారు. దాదాపు కూరగాయల ధరల్లో పెద్ద వ్యత్యాసం లేదు.ఉల్లి హోల్‌సేల్ ధరలో క్వింటా రూ.2150 అమ్ము తున్నారు. రిటైలర్స్ మాత్రం నాలుగు కిలోలు ఉల్లి రూ.100కు, 10 కిలోల బస్తా రూ.250కు విక్రయిస్తున్నారు. గతవారం నాణ్యమైన ఉల్లి 50 కిలోల బస్తా రూ.1200కు విక్రయించారు. హోల్‌సేల్‌లో ధరలు తగ్గినా రిటైలర్స్ మాత్రం తగ్గించడం లేదు.



పోటీల్లో మెడల్స్ సాధించిన సరస్వతీ విద్యాలయ విద్యార్థులు

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో సరస్వతీ విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

పెంటపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు విభాగాల బాస్కట్ బాల్ పోటీలలో ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయ్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారని పాఠశాల చైర్మన్ కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణరాజు తెలిపారు. ప్రత్తిపాడు సరస్వతీ విద్యాయల పాఠశాలలో కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్ (సీఐఎస్ సీఈ) రాష్ట్ర స్థాయి అండర్ 14, 17, 19 విభాగాలలో బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. పోటీలకు రాష్ట్రం నుంచి జోన్ల వారీగా విజయవాడ, విశాఖ పట్టణం, అమలాపురం, రావులపాలెం, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారని చైర్మన్ వెంకట్ తెలిపారు. పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడు విభాగాలలోనూ బంగారు, కాంస్య పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కొలనువాడ స్వాతి అన్నపూర్ణ, కోచ్ సత్యకిరణ్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



అనివేటి మండపంలో భక్తుల రద్దీ

కిటకిటలాడిన చిన వెంకన్న ఆలయం

ద్వారకాతిరుమల,జూలై 13 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్ర వాహనాలతో నిండింది. 15 వేల మందికి పైబడి యాత్రికులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి 3 గంటల పైబడి సమయం పట్టింది.



పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం, జూలై 13: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఈఈ యేసుబాబు ఆదివారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 18 మీటర్లకు పైబడి ఉండడంతో 22 మోటార్లు 22 పంపుల ద్వారా నీటి విడుదల చేసినట్లు తెలిపారు. కృష్ణా ఉమ్మడి పశ్చిమ డెల్టాల సాగునీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోటార్లు, పంపుల సంఖ్య పెంచామన్నారు.



గండిపడిన చినలంక వంతెన పరిశీలిస్తున్న పాత్తూరి

చినలంక అప్రోచ్‌కు గండి

నరసాపురం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినలంక, పీఎంలంక మార్గాలను కలిపే వంతెన అప్రోచ్ రహదారి కోతకు గురైంది. పోటు, పాటుకు నీటి ప్రవాహం ఎక్కువుగా ఉండటంతో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్‌కు గండిపడింది. దీంతో సగం రోడ్డు నల్లిక్రిక్ పాయిలో కలిసిపోయింది. మరో కొద్దిసేపు గడిస్తే మిగిలిన రోడ్డు కూడా కోతకు గురయ్యే ప్రమాదం ఉందని గుర్తించిన గ్రామస్థులు వెంటనే టీడీపీ ఇన్‌చార్జి రామరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాత్కాలికంగా పంచాయతీ సిబ్బంది రాళ్లతో కోతకు గురైన ప్రదేశంలో అడ్డుకట్ట వేశారు. ఆనంతరం రామరాజు మాట్లాడుతూ కీలకమైన ఈ రోడ్ మరమ్మతు పనులతో పాటు వంతెన పనుల్ని కూడా చేపడతామన్నారు. నల్లిక్రిక్ పనుల్లో భాగంగా దీన్ని పూర్తి చేస్తామన్నారు.

ఉమ్మడి జిల్లాతో 'కోట' అనుబంధం

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతితో గోదావరి వాసులు దిగ్భ్రాంతికి గురయ్యారు.. ఆయన సినిమా షూటింగ్‌ల కోసం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు విచ్చేశారు.. ఆ సమయంలో స్థానికులను ఎంతో ఆపాయ్యంగా పలకరించేవారని గుర్తు చేసుకున్నారు. కళాకారులకు ఎంతో గౌరవం ఇచ్చేవారని కళారంగంలో ఉన్నవారు ఆయనను స్మరణకు తెచ్చుకున్నారు.

పోలవరంలో సినిమా షూటింగ్‌లకు..

పోలవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పోలవరం పరిసర ప్రాంతాల్లో నిర్మించిన ఎన్నో సినిమాల్లో కోట శ్రీనివాసరావు నటించారు. వాటిలో సీతారామయ్యగారి మనవరాలు, రాజేశ్వరి కళ్యాణం, తాండ్ర పాపారాయుడు సినిమాలు కొన్ని. 2006 సంవత్సరంలో కృష్ణవంశీ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్, ఇలియానా చార్మి నటించిన రాఖీ సినిమా షూటింగ్ పోలవరం మండలం పట్టిసీమ, టేకూరు గ్రామాల్లో నిర్మించారు. ఆ సినిమా షూటింగ్ కోసం పట్టిసీమ వచ్చిన కోట శ్రీనివాసరావుకి అప్పట్లో షూటింగ్ చూడడానికి వచ్చిన స్థానికులతో పోలవరం పరిసర ప్రాంతాల ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. షూటింగ్ విరామ సమయంలో వారితో ముచ్చట్లాడి స్థానిక విశేషాలు తెలుసుకునేవారని, పట్టిసీమ శివక్షేత్రం విశేషాలు అడిగేవారని, స్థానిక వంటలు సంప్రదాయాల గురించి, స్టేజ్ ఆర్టిస్టుల వివరాలు అడిగి తెలుసుకునేవారని పట్టిసీమ, టేకూరు గ్రామస్థులు తెలిపారు. ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారని సినీ పరిశ్రమలో ఆయన లేని లోటు తీర్చలేనిదని గ్రామస్థులు తెలిపారు.

గూడెం బీజేపీ నాయకులతో సంబంధాలు



తాడేపల్లిగూడెంలో బీజేపీ నాయకుడు ఆనంద్ కుమార్తె పుట్టినరోజు వేడుకల్లో..

తాడేపల్లిగూడెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోట శ్రీనివాసరావుకు తాడేపల్లిగూడెంతో ప్రత్యేక అనుబంధం ఉంది. రాజకీయపరమైన ప్రచారంలో 1999 తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రచారంలో పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి తాడేపల్లిగూడెంలో రైల్లో ఆయన ఇక్కడికి వచ్చారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా బీజేపీ తరపున నెగ్గిన ఆయన తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరుపున ప్రచారానికి వచ్చారు. జీకే కాన్ఫరెన్స్‌హాల్లో కొద్ది సేపు బసచేశారు. అప్పటి బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రి ప్రభాకర బాలాజీ, పైడికొండల మాణిక్యాలరావు, జీకే ఆనంద్, గట్టిం మాణిక్యాలరావు, కొండపల్లి నగేష్‌లుతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. జీకే కాన్ఫరెన్స్ హాల్లో జీకే ఆనంద్ కుమార్తె పుట్టిన రోజున పాల్గొని కేక్ తినిపించారు. అప్పటి నుంచి తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని బీజేపీ నాయకులతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఫోన్ చేసిన వెంటనే స్పందించడంతో పాటు తాడేపల్లిగూడెం నుంచి ఇక్కడ కార్యకర్తలు హైదరాబాద్‌లో వెళితే వైద్యసేవలు అందించేందుకు సాయపడేవారని బీజేపీ నాయకులు గట్టిం మాణిక్యాలరావు, జీకే ఆనంద్‌లు చెప్పారు.

పాలకొల్లులో కళాకారుల సన్మానం

పాలకొల్లు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కళలకు నిలయమైన పాలకొల్లులో 1996లో సన్మానం అందుకున్నారు. ప్రముఖ సినీ దర్శకుడు, పాలకొల్లు వాసి కోడి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే లలిత కళాంజలి నాటక అకాడమీ 16వ వార్షికోత్సవం సందర్భంగా 1996లో నిర్వహించిన జాతీయస్థాయి నాటికల పోటీల చివరి రోజున బీవీఆర్ఆర్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో కోట శ్రీని వాసరావును ఘనంగా సత్క రించారు. ఆయన మృతికి పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కెవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసరావు చౌదరి, డాక్టర్ వర్మ, వెంకట రమణ, వ్యస్థాపకుడు మానాపురం సత్యనారాయణ, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఏలూరు వైఎంహెచ్‌ఏలో సత్కారం

ఏలూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కోట శ్రీనివాసరావు మృతి కళారంగానికి తీరని లోటనీ కళారత్న కెవీ సత్యనారాయణ సంతాపం తెలిపారు. 700 పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి, ప్రత్యేకత నిలుపుకున్న కళాకారుడు కోట శ్రీనివాస్‌ని ఏలూరులో వైఎంహెచ్‌ఏ హాల్లో జరిగిన వేడుకల్లో ఘనంగా సత్కరించినట్లు ఆయన తెలిపారు. వైఎంహెచ్‌ఏల్లో కోట శ్రీనివాస్‌రావును సన్మానించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.



పట్టిసీమలో రాఖీ చిత్రం షూటింగ్‌లో కోట శ్రీనివాసరావు

మావుళ్లమ్మ ఉత్సవాల్లో సువర్ణ హస్తా కంకణంతో సత్కారం

భీమవరం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) :1991లో మావుళ్ళమ్మ వార్షిక మహోత్సవాల్లో ఆయనను సువర్ణ హస్తా కంకణంతో ఘనంగా సత్కరించారు. అమ్మవారిని దర్శించుకుని ఎంతో తన్మయత్వం చెందారని ఆనాటి రోజులను నిర్వాహకులు తలచుకున్నారు. అదే విధంగా 2010లో డీఎన్ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన చైతన్య బారతి సంగీత, నృత్యనాటక పరిషత్ ఆధ్వర్యంలో జరిగే జాతీయస్థాయి నాటక పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనగా నిర్వాహకులు ఆయను ఘనంగా సత్కరించారు.



భీమవరం మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సత్కారం(ఫైల్)

ఎంపీఈవోలకు రెన్యువల్ కష్టాలు

ప్రతీ ఏడాది తప్పని తిప్పలు

నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్

ఏలూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ఎంపీఈవోలకు రెన్యువల్ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రతీ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు రెన్యువల్ చేస్తూ జీవో జారీ చేయాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు గడిచినా 2005-16 ఆర్థిక సంవత్సరానికి సంంధించి రాష్ట్ర ప్రభుత్వం రెన్యువల్ జీవో జారీ చేయకపోవడంతో బాధిత ఎంపీఈఓలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 47 మంది ఎంపీఈవోలు

వ్యవసాయశాఖ పరిధిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 47 మంది ఎంపీఈవోలు పనిచేస్తున్నారు. 724 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీరికి నెలకు రూ.12 వేలు వేతనంతో పాటు మరో రూ.3 వేలు ఇన్సెంటివ్ అందిస్తున్నారు. అయితే గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 2015 సంవత్సరంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎంపీఈఓలను ఉద్యోగంలోకి తీసుకున్నారు. అప్పట్లో ప్రతీ ఏడాది సకాలంలో రెన్యువల్ జీవోను జారీ చేసేవారు. అయితే గత వైసీపీ పాలనలో ప్రతీ ఏడాది నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో ఇస్తూ వచ్చారు. దీంతో ప్రతీ ఐదు నెలలు వేతనాలు పెండింగ్లో పెడుతూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరినా వారి కష్టాలు తీరలేదు. కమిషనరేట్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ఆరంభానికి ముందే జిల్లా వ్యవసాయ అధికారులతో ఎంపీఈవోల వివరాలు తెప్పించుకుని, ప్రభుత్వానికి రెన్యువల్ కోసం ఫైల్ పెట్టడంతో రాష్ట్ర కమిషనరేట్ అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెన్యూవల్ ఫైల్ ఆర్థికశాఖ వద్ద ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 47 మంది ఎంపీఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. అయినా రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా వేతనం ఇవ్వడం లేదు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రం సిబ్బంది నెలకు రూ.34 వేలు వేతనం పొందుతున్నారు. ఎంపీఈవోలకు నెలకు రూ.12 వేలతో పాటు ప్రోత్సాహక రుసుం రూ.3 వేలు అందిస్తున్నారు. ఎంపీఈవోల పనితీరు బాగుందని వ్యవసాయధికారి నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తేనే రూ.3 వేలు ప్రోత్సాహక రుసుం అందిస్తారు. లేదంటే ఆ సొమ్ము రాదు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమానంగా పనులు చేస్తున్న తమకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలని ఎంపీఈవో సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం రైతు సేవా కేంద్రం

• సమాన వేతనం ఇవ్వాలి



రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా ఎంపీఈవోలు పని చేస్తున్నారు. వారికి నెలకు అన్ని రకాల అలవెన్సు కలిపి రూ.34 వేలు వేతనం ఇస్తున్నారు. గత పదేళ్లగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఎంపీఈవోలకు నెలకు రూ.12 వేలతో పాటు రూ.3 వేలు ప్రోత్సాహక రుసుం ఇస్తూన్నారు. మినిమం టైం స్కేల్ వర్తింపజేసి, సమాన పనికి సమాన వేతనం అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని ఎంపీఈవోలను ఆదుకోవాలి. సీఎం చంద్రబాబు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడులు ప్రత్యేక చొరవ తీసుకుని ఎంపీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

- జి.ఫణికుమార్, ఏపీ ఎంపీఈవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

• సకాలంలో రెన్యువల్ చేయాలి



గత ప్రభుత్వ హయాంలో నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో జారీ చేస్తూ వచ్చారు. దీంతో ఐదు నెలల పాటు వేతనాలు ఆలస్యంగా వచ్చేవి. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రెన్యువల్ జీవో జారీ చేయడంలో జాప్యం జరుగుతోంది.నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో బయట వ్యక్తులతో అప్పులు తెచ్చుకుని కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. ఇప్పటి నుంచైనా సకాలంలో రెన్యువల్ జీవో జారీ చేసి, ప్రతీ నెలా వేతనం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పి.అజయ్, ఎంపీఈవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి



పుష్కరాల పనులపై నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

పుష్కరాలకు ఏం కావాలి ?

నియోజక వర్గస్థాయి అధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష

పాలకొల్లు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్క రాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా సమన్వయంతో విజయ వంతంగా పూర్తి చేద్దామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు రామచంద్ర గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో శనివారం రాత్రి 2027లో వచ్చే గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి కూటమి నాయకులు, నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ పుష్కర అభివృద్ధి పనులు ఏమేం చేపట్టాలి ? ఎన్నినిధులు అవసరం ? పనులు పూర్తి కావ డానికి ఎంత సమయం అవసరం ? అన్న అంశాలపై ప్రణాళికలు రూపొం దించాల్సి ఉందన్నారు. శాఖల వారీగా చేపట్టవలసిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కూటమి నాయకులు, అధికారులు ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. 2027 జూలై 23వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ పుష్కరాలు జరుగుతాయని మహా కుంభ మేళాకు ధీటుగా వీటిని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డీవో దాసిరాజు, తహసల్దార్ దుర్గా కిషోర్, కమిషనర్ విజయ సారధి, పోడూరు, యలమంచిలి తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఇంజనీరింగ్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల సేవా సంఘం అధ్యక్షుడిగా బండి శ్రీనివాసరావు



పాలకోడేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల సేవా సంఘ అధ్యక్షుడిగా పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన బండి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ప్రస్తుతం భీమవరంలో అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివాసీ ఎరుకుల హక్కుల కోసం, అణగారిన ఎరుకుల కులస్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. శ్రీనివాసరావును వివిధ జిల్లాల అధ్యక్షులు అభినందించారు.





రోడ్డు ప్రమాదంలో బోల్తా పడిన ఆటో.. తీవ్ర గాయాలపాలైన ఆటో డ్రైవర్‌ను అంబులెన్స్ ఎక్కించి పంపుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

కారు..ఆటో ఢీ : ఇద్దరికి గాయాలు

ద్వారకాతిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఓ కారు వేగంగా వెళ్తూ ఆటోను ఢీకొన్న ప్రమాద ఘటనలో తీవ్రగాయాల పాలైన ఇద్దరిని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అంబులెన్స్‌లో ఆసుపత్రికి పంపారు. మండలంలోని లక్ష్మీనగర్ రాష్ట్రీయ రహదారిపై ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇదే సమయంలో అటువైపు వెళ్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు తన కారు ఆపి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి రప్పించి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు.



వెలగలపల్లి సమీపంలో చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు : పలువురికి గాయాలు

చింతలపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలం వెలగలపల్లి శివారు ఊరచెరువు సమీపంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సత్తుపల్లి ఆర్టీసీ డిపో బస్సు ఏలూరు వెళ్తుండగా బస్సు గోతులో పడి అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఆదివారం ఉదయం ఈ సంఘటన జరిగింది. సత్తుపల్లి నుంచి ఉదయం ఏలూరు వెళ్తున్న ఈ బస్సులో 30 మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో 13 మందికి గాయాలయ్యాయి. నలుగురిని మెరుగైన చికిత్సకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారు చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స తీసుకుని వెళ్ళిపోయారు. బస్సు డ్రైవర్ నర్సింగరావును ప్రశ్నించగా బస్సు అదుపు తప్పి స్టీరింగ్ కంట్రోల్ కాకపోవడంతో చెట్టును ఢీకొందని, స్వల్ప గాయాలైన వారిని 108లో ఆసుపత్రికి పంపించామని తెలిపారు. మిగతా ప్రయాణికులను వేరే బస్సులో తరలించినట్టు చెప్పారు.

పాముకాటుకు మహిళ మృతి

ఏలూరు క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పొలంపనికి వెళ్ళిన మహిళను పాము కాటు వేయడంతో మృతి చెందింది. చింతలపూడి మండలం వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన బొడ్డు వెంకాయమ్మ ఆదివారం ఉదయం కూలీ పని నిమిత్తం పొలం వెళ్లింది. పాముకాటు వేయడంతో గమనించిన తోటి పనివారు ఆమెను వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నిర్మాణంలో ఉన్న ఇంట్లో విద్యుత్ వైర్లు చోరీ

ఏలూరు క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణం కోసం నూతనంగా నిర్మాణం అవుతున్న ఇంటిలో ఉంచిన కరెంటు వైర్లను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారని బాధితుడు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు శనగపప్పు బజార్ ఐదు దుకాణాల ప్రాంతంలో కనిగొళ్ళ మణి ప్రశాంత్ నూతనంగా ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఆ ఇంట్లో విద్యుత్ వైరింగ్ నిమిత్తం 11 కట్టల విద్యుత్ వైర్లను తెచ్చి ఉంచారు. ఆదివారం ఉదయం వెళ్ళి చూసేపరికి కనిపంచలేదు. దీంతో ఆదివారం మధ్యాహ్నం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏలూరు శాంతినగర్‌లో చైన్ స్నాచింగ్

ఏలూరు క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడిచి వెళుతున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు యువకులు తెంపుకుని మోటారు సైకిల్‌పై పరారీ అయ్యారు. విజయవాడకు చెందిన అత్తి వెంకటేశ్వరమ్మ (49) ఏలూరు సత్రంపాడులో ఉన్న ఆమె కుమార్తె ఇంటికి ఈనెల 12వ తేదీ రాత్రి బస్సులో వచ్చారు. సత్రంపాడు బ్రిడ్జి వద్ద బస్సు దిగి శాంతినగర్ 13, 14 రోడ్డులలో నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న 20 గ్రాముల బంగారపు గొలుసును తెంపుకుని పారిపోయారు. బాధితురాలు ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై అత్యాచారయత్నం

ఉండి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిరిగా ఉన్న యువతిపై ఒక యువకుడు అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె కేకలు వేయడంతో అతను పరారయ్యాడు. దీనిపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పాములపర్రు గ్రామానికి చెందిన వర్రే రాజేష్ ఉండి శివారు గ్రామం నక్కారాజుగుంటకు శనివారం వంటపనివారి కోసం వెళ్లాడు. ఆ ఇంట్లో వున్న 19 ఏళ్ల యువతి బయటకు రాగా మీ అమ్మకోసం వచ్చాను అని చెప్పగా ఆమె బయటకు వెళ్లిందని చెప్పింది.ఆమె ఫోన్ నెంబరు తీసుకుని వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం మళ్లీ వచ్చాడు. ఇంట్లో ఎవరు లేరని తెలుసుకుని యువతిపై అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె కేకలు వేయడంతో అతను అక్కడ నుంచి పారిపోయాడు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

భార్యపై భర్త కత్తితో దాడి



స్థానికులు నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీవేద

పాలకొల్లు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు మండలం అరట్లకట్ట గ్రామంలో శనివారం రాత్రి భార్యభర్తల తగాదాలో భార్యపై భర్త కత్తితో దాడి చేశాడు, పాలకొల్లు రూరల్ ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం యాళ్లబండి వెంకట రమణ, వెంకటేశ్వర్లు భార్య భర్తలు. శనివారం రాత్రి భార్య నిద్రిస్తుండగా ఆమె భర్త వెంకటేశ్వర్లు కత్తితో దాడిచేసి ఆమె పీకపై గాయపర్చాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో భర్త అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు ఆమెను పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతానికి ఆమెకు ప్రాణాపాయం లేదని తెలిపారు. కొంత కాలంగా భార్యభర్తలిద్దరూ గొడవలు పడుతున్నారని ఈక్రమంలోనే ఈ సంఘటన జరిగినట్లు తెలిపారు. నరసాపురం డీఎస్పీ శ్రీవేద సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీచర్ల గ్రామంలో గంగాలమ్మ అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.



ట్రిపుల్ ఐటికి గాయత్రి ఎంపిక



మొగల్తూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థిని రేవు లక్ష్మీ గాయత్రీ ఐఐఐటికి ఎంపికయ్యింది. ఆదివారం విడుదల చేసిన రెండవ జాబితాలో ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు రామరాజు తెలిపారు. సర్పంచ్ అడ్డాల సూరిబాబు, ఎంపీటీసీ స్వామి, ఎస్ఎంసి చైర్మన్ చూడామణి అభినందించారు.



మాదివాడలో భ్రమరాంబికాదేవికి సారె తెచ్చిన మహిళలు





ప్రత్యేక అలంకరణలో చింతాలమ్మవారు.. వెంకమ్మకు ఆషాఢ సారె





మాలేలమ్మకు ఆషాఢ సారె.. మొయ్యేరులో శాకంబరిగా దుర్గమ్మ



దుంపగడపలో అమ్మవార్లకు సారె సమర్పించిన భక్తులు

అమ్మవార్లకు అలంకరణ, సారె

చింతాలమ్మ..

పెంటపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతపల్లి గ్రామ దేవత చింతాలమ్మకు ఆషాఢం సందర్భంగా ఆదివారం గ్రామస్థులు ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి సారెను గ్రామం మొత్తం పంచిపెట్టారు. ఏర్పాట్లను ఇందుకూరి రామరాజు, నడిపల్లి సుబ్బరాజు, ఆబోతుల దానయ్య, మట్టా నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

వెంకమ్మ..

మొగల్తూరు: కొత్తోటలో దేవర వెంకమ్మకు ఆదివారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారి పుట్టింటి కుటుంబ సభ్యులైన బొలిశెట్టి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చనివిడి, పానకాల కావిళ్ళతో పాటు సుమారు 50 రకాల స్వీట్లుతో నైవేద్యాలు సమర్పించారు.

భ్రమరాంబికాదేవి..

ఆకివీడు: మాదివాడ భ్రమరాంబికాదేవికి శివకేశవ భజన మండలి మహిళలు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. అదే విధంగా స్థానిక శ్రీరామపురం భక్తులు భాజభజీంత్రీలతో భారీ ఊరేగింపుగా పెద్దింట్లమ్మకు ఆషాఢమాస సారె అందచేశారు.

మావుళ్ళమ్మ..

భీమవరం టౌన్: మావుళ్ళమ్మకు ఆషాఢ మాసం సందర్భంగా రెస్టహౌస్ రోడ్‌కి చెందిన మిండి ఈశ్వరరావు నాగ సుధ దంపతులు, వారి కుటుంబ సభ్యులు 50 రకాల పండ్లు, స్వీట్స్‌తో అమ్మవారికి సారె సమర్పించారు. ముందుగా రెస్టహౌస్‌రోడ్డు నుంచి ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు.

మాలేలమ్మ..

ఉండి: మాలేలమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను భక్తులు అందించారు. ఆదివారం కలికిపూడిలోని మాలేలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢం పురస్కరించుకుని అమ్మవారికి వివిధ రకాలైన స్వీట్లు, పండ్లు, కాయగూరలు, ఆకుకూరలతో కావెళ్లతో ఊరేగింపుగా సారెను అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశబోయిన జానకి, ఎంపీటీసీ దంగేటి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

దుంపగడప గ్రామ దేవతలు..

ఆకివీడు రూరల్: దుంపగడప గ్రామదేవతలైన మారెమ్మ, వెంకమ్మ, భూలక్ష్మమ్మ అమ్మవార్లకు గ్రామంలోని మహిళలు ఆషాఢ సారెను సమర్పించారు. ఉదయాన్నే భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మేళతాళాలు, బాణ సంచా కాల్పుల మధ్య సారెను ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయానికి తీసుకొచ్చారు.

కనకదుర్గమ్మ..

గణపవరం: మొయ్యేరులోని కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. మాకా శ్రీనివాసరావు దంపతులు విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు సమకూర్చిన కూరగాయాలతో శాకంబరిదేవిగా అలంకరించారు. మహిళలు మేళతాళాలతో భారీఎత్తున ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

యలమంచిలి: స్థానిక శ్రీపుంతల ముసలమ్మ, శ్రీమూలస్థానేశ్వరి, మారెమ్మ, దేవారమ్మ అమ్మవార్లకు మహిళలు ఆషాఢ సారెను ఆదివారం సమర్పించారు. చలిమిడి, పానకం, స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరలను అమ్మవార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. లలిత సహస్రనామ పారాయణ చేపట్టారు.

డిజిటల్ లక్ష్మి వస్తోంది..

5వ పేజీ తరువాయి

నిబంధనల ప్రకారం అర్హులను ఎంపికచేసి త్వరలో ఈ సెంటర్లను ఏర్పాటుచేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒక్కొక్క సెంటర్‌లో ముగ్గురు ఉపాధి పొందే అవకాశం ఉంది. నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వస్తుందని అధికారుల అంచనా. సెంటర్ కేటాయించిన మహిళలకు కంప్యూటర్‌పై పనిచేయడంలో అనుభవం ఉండాలి. ఎంపికైన వారికి శిక్షణ అనంతరం కేంద్రం ఏర్పాటు చేయిస్తారు. సెంటర్ ఏర్పాటుకు కియోస్క్, ఇతర సదుపాయాలకు రూ 2.50 లక్షలు రుణ సదుపాయం కూడా కల్పించనున్నారు.

ఇవీ అర్హతలు

- స్వయం సహాయక సంఘంలో కనీసం మూడేళ్ల క్రితం చేరి ఉండాలి.
- 21 నుంచి 40 ఏళ్ల వివాహితులై ఉండాలి.
- వెనుకబడిన ప్రాంత నివాసితులై ఉండాలి.
- డిగ్రీ అర్హత కలిగి ఉండాలి.
- స్మార్ట్ ఫోన్ కలిగి ఉండాలి.







రావిపాడులో వలవల బాబ్జి సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు.. మొయ్యేరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు వేణు.. మోగల్లులో టీడీపీ నాయకుల ప్రచారం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

టీడీపీ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు

పెంటపాడు/తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. ఆదివారం రావిపాడులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సొసైటీ మాజీ అధ్యక్షుడు ములగాల బాబ్జితో పాటు సుమారు 50 మంది వలవల బాబ్జి సమక్షంలో పార్టీలో చేరగా బాబ్జి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీష్, మాజీ ఎంపీపీ పెదపోలు వెంకటేశ్వర్లు, ములగాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో 15 వార్డులో వలవల బాబ్జి స్థానికులతో మాట్లాడి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, పద్మనాభుని మురళి, పాతూరి రాంప్రసాద్‌చౌదరి పాల్గొన్నారు.

ఉండి: యండగండిలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు మంతెన వేణువర్మ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ మహిళలకు కూటమి ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజు, మంతెన వేణువర్మ పాల్గొన్నారు.

పాలకోడేరు: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మోగల్లు గ్రామంలో ఆదివారం స్థానిక కూటమి నాయకులు నిర్వహించారు. నాయకులు ప్రతి ఇంటికి వెళ్ళి గత సంవత్సర కాలంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు వనుం వెంకటేష్, కొత్తపల్లి సూర్యనారాయణరాజు, శంకరుడు, కలిదిండి సందీప్ వర్మ, మల్లిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సహకార సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని 50వ బూత్‌లో సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు.

గణపవరం: కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతోందని గణపవరం మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు ముచ్చర్ల వేణుగోపాలమురళీకృష్ణ అన్నారు. ఆదివారం మొయ్యేరు గ్రామంలో సుపరిపాలన - తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికాలం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పై వివరిస్తూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ టీడీపీ యాప్‌లో నమోదు చేశారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజల దగ్గరకు వెళ్లి వారి సంతృప్తపాళ్లు తెలుసుకుని ప్రజల అవసరాలను తీర్చడమే సుపరిపాలన లక్ష్యమని తాడేపల్లిగూడెం క్లస్టర్ కో ఇన్‌చార్జి శనగన శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. నందమూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నూరుశాతం పూర్తిచేసిన సందర్భంగా ఆదివారం టీడీపి నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సాదుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ములపర్తి నారాయణరావు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలకు విచ్చేసిన అభ్యర్థులతో ఎమ్మెల్యే ఆరిమిల్లి

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

తణుకు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో 70 బహుళ జాతి సంస్థలు ద్వారా ఉద్యోగాల కల్పనకు అవకాశాలు కల్పించామని చెప్పారు. నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా పక్కనే ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు నాలుగు వేల మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్, ప్రధాని మోదీ సహకారంతో మొదటి ఏడాదిలోనే 4.50లక్షల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రుపొందించినట్టు చెప్పారు.

వృద్ధులకు ఇంటింటా వైద్య సేవలు

తణుకు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా సంచార శకటం ద్వారా వృద్ధులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్. రమేష్ కుమార్ తణుకు, పాలంగి ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురికి వైద్య సేవలందించారు. సంఘ సభ్యులు అతికాల ప్రసాదరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్థి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే బొలిశెట్టి



ఎమ్మెల్యే బొలిశెట్టికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని ఇస్తున్న డిప్యూటీ ఈవో

ద్వారకాతిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయమర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా ఆయన ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం బంగారువాకిలి నుంచి లోనికి వెళ్లి గర్భాలయంలో కొలువైన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఆలయ డిప్యూటీ ఈవో భద్రాజీ ఆయనకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

అమ్మవారికి 100 గ్రాముల వెండి బహూకరణ

భీమవరం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి ఆదివారం దాతలు 100 గ్రాముల వెండిని విరాళాలు అందించారు. పట్టణానికి చెందిన తవ్వా గురునాథం, వెంకట నాగ లక్ష్మి దంపతులు అందించారు.

ఎం.ఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పాకా సత్యనారాయణ

కాళ్ళ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ డాక్టర్ ఎంఆర్ రాజు ఆశయసాధనకు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరు బాపిరాజు అన్నారు. పెద అమిరంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ భవనంలో నిర్వహించిన పద్మశ్రీ డాక్టర్ ముదుండి రామకృష్ణంరాజు (ఎం.ఆర్. రాజు) స్మృత్యంజలి సభలో వారు పాల్గొని మాట్లాడారు. సభకు పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యసించి, క్యాన్సర్ వ్యాధిపై అమెరికాలో పరిశోధనలు చేసి, స్వగ్రామం పెద అమిరంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు సుమారు 4 దశాబ్దాలపాటు వైద్యసేవలు అందించి చిరస్మరణీయులయ్యారని అన్నారు. జిల్లా కేంద్రం భీమవరంలో సైన్స్‌పార్కు ఏర్పాటు చేసి దానికి డాక్టర్ ఎం.ఆర్. రాజు పేరు పెట్టాలని సర్వోదయ మండలి తరపున వినతి పత్రాన్ని ప్రజాప్రతినిధులకు అందించారు. ఈ సభలో ఎం.ఆర్. రాజు కుమారులు మంతెన రామ్‌కుమార్ రాజు, దంతులూరి రంగరాజు, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఎంవీఎస్ రాజు, ప్రొఫెసర్ ఎస్ఆర్ పరిమి పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం పంపిణీ

గణపవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బొబ్బిలి వంతెన, సాయిబాబా, వెంకటేశ్వరస్వామి ఆలయం, సంతమార్కెట్, ప్రాంతాల్లో నివాసం ఉన్న పేదలకు, బిక్షగాళ్లకు అల్పాహారం పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి సరేశ్‌కుమార్, సెక్రటరీ కిలారి రవిబాబు, కోశాధికారి కాళ్లకూరి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ ప్రారంభం



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ మేరీ

మొగల్తూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు లాకు వద్ద దాతలు పునర్నిర్మాణం చేసినబస్ షెల్టర్‌ను సర్పంచ్ పడవల మేరీ ప్రారంభించారు. మొగల్తూరు లాకు వద్ద మాజీ ఉప సర్పంచ్ పొన్నపల్లి త్రినాద్ ఉడయార్ సోదరుడు దివంగత పొన్నపల్లి నాగేశ్వరరావు పేరిట 2 దశాబ్దాల క్రితం బస్ షెల్టర్ నిర్మించారు. బస్ షెల్టర్ శిధిలావస్థకు చేరింది. దీంతో నాటి దాత కుటుంబ సభ్యులు త్రినాద్ ఉడయార్ బస్ షెల్టర్‌ను నిర్మించారు.

వాసవీ క్లబ్ సేవల్ని విస్తృతపర్చాలి

నరసాపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత సేవాలందించేందుకు వాసవీ క్లబ్‌లు నిరంతరం కృషి చేయాలని రీజనల్ చైర్మన్ వి.శ్యామల అన్నారు. పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయం వద్ద ఆదివారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని జోన్ చైర్మన్ అప్పన్న బద్రీలతో కలిసి పరిశీలించారు. జగన్నాధస్వామి గోశాలలో పశువులకు కూరగాయాలు, డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఎంబర్‌మన్నార్ ఆలయంలో భక్తులు కూర్చొనేందుకు బెంచీలు బహూకరించారు. ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నూలి శ్రీనివాస్, కె బాబ్జీ, కె బాలకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగుమందుల డీలర్ల సంఘ కార్యవర్గం



డీలర్‌ల సంఘ అధ్యక్షునిడిని సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం ఎరువులు, పురుగుమందుల డీలర్‌ల సంఘ అధ్యక్షునిగా మోదుగుగుంటకు చెందిన సిద్దా వీర్రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం డీలర్‌ల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా కంఠమణి జనార్ధన్(జగన్నాధపురం), కోశాధికారిగా కామిశెట్టి కాశీవిశ్వనాధం (మాధవరం), కార్యదర్శిగా కట్టా గౌతమ్ (వీరంపాలెం) తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మద్దుకూరి ధనరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, నాయకులు చిక్కాల సత్యనారాయణ అభినందించారు.

ఆనందరాజు మృతి తీరని లోటు



ఆనందరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వేగేశ్న ఆనందరాజు మృతి సమాజానికి తీరనిలోటని క్షత్రియ సేవా సమాఖ్య ప్రముఖులు పేర్కొన్నారు. తాడేపల్లి గూడెంలో క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆనందరాజు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య తాడేపల్లిగూడెం అధ్యక్షులు సీహెచ్‌ఏఆర్‌కే వర్మ ఆధ్వర్యంలో ఆనందరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వేగేశ్న భాస్కరరాజు, పేరిచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు పేరిచర్ల మురళికృష్ణంరాజు పాల్గొన్నారు.

కోటకు బీజేపీ నాయకుల నివాళి

తాడేపల్లిగూడెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విలక్షణ నటుడు, బీజేపీ మాజీ శాసనసభ్యుడు కోట శ్రీనివాసరావుకు తాడేపల్లిగూడెం నియోజకవర్గం బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఘననివాళులు అర్పించారు. ఆయన మృతి బీజేపీకి తీరని లోటని నియోజకవర్గం కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. బీజేపీ కార్యాలయంలో కోట శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, నాయకులు గట్టిం మాణిక్యాలరావు, కంచుమర్తి నాగేశ్వరరావు, అయినం బాలకృష్ణ, రామగని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయ వృత్తి గౌరవ ప్రదమైనది

పాలకొల్లు టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేసే పాత్రికేయ వృత్తి చాలా గౌరవ ప్రదమైనదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ హాల్లో నియోజకవర్గ స్థాయి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులతో ఇష్టాగోష్టిగా ఆత్మీయ (గెట్ టు గెదర్) సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకట రమణ అధ్యక్షత వహించారు. ముందుగా మంత్రి రామానాయుడుకు పాత్రికేయులు శాలువ కప్పి స్వాగతం పలికారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గాన్ని తన సొంత కుటుంబంలా చూసుకుంటానని అన్నారు. పాత్రికేయులకు అన్ని విధాలా న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వి సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ఐజేయు సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, కాగిత సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



న్యూ ఆంధ్రా బాడీ బిల్డర్స్ కార్యవర్గం

భీమవరం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): న్యూ ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని భీమవరం బీవీ రాజు, వీరమ్మ పార్క్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షునిగా డీఎస్ రాజు (భీమవరం), ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాసిం, గౌరవాధ్యక్షులుగా డి.జానీ, జిల్లా అధ్యక్షునిగా బంగారు వినోద్‌లు నియమితులయ్యారు. వీరితోపాటు రాష్ట్ర అసోసియేషన్‌లో ఉపాధ్యక్షులుగా మూర్తి, కోరాడ శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా కట్టా శ్రీను, రామకృష్ణ, లీగల్ సెల్ చైర్మన్‌గా ఇంజేటి వెంకటేశ్వర్లు, కన్వీనర్‌గా బొల్లా శ్రీను, ఆర్గనైజింగ్ విజయ్‌లు నియమితులయ్యారు. అనంతరం ఎన్నికైన వారిని సత్కరించారు. అధ్యక్షులు చింతలపాటి రామకృష్ణంరాజు, కారుమూరి నరసింహమూర్తి బాబు, షేక్ పాదుషా, ఎస్‌కే బాజీ, కోడి రాజు, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో వృక్షాల నరికివేత



వేంద్ర గ్రామంలో రహదారి పక్కన చెట్లను నరికేసిన దృశ్యం

పాలకోడేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలం వేంద్ర డెల్టా పేపర్ మిల్లు వద్ద హైటెన్షన్ లైన్ వేసే నిమిత్తం సంబంధిత విద్యుత్ శాఖ వారు లైన్‌కు అడ్డం వచ్చిన మహా వృక్షాలను సైతం నరికివేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మనిషికి కావలసిన ప్రాణవాయువును వృక్షాలు అందిస్తాయి. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటండి అనే నినాదాన్ని ప్రజలకు అందిస్తుంటే విద్యుత్ శాఖ అధికారులు మాత్రం మహావృక్షాలను సైతం నేలకూల్చడం ఆశ్చర్యంగా ఉందని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి మొక్కలు కూల్చే కార్యక్రమాన్ని అరికట్టాలని స్థానికులు కోరుచున్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆచంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జేఎస్‌పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆచంట వేమవరం 1986-87 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో వేడుకగా జరిగింది. సుమారు 70 మంది విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు. ఆటపాటలతో గడిపారు.

పండు‘గొప్ప’

5వ పేజీ తరువాయి

పండుగొప్ప చేప సాగులో మార్కెట్ ధరలో మార్పులు మినహా ఇతర నష్టాలు ఉండవు. పెట్టుబడికి ఢోకా ఉండదు. ఎకరాకు వేసిన పిల్లలను బట్టి దిగుబడి టన్నేజీ ఉంటుంది. సాధారణంగా 4కిలోలు దాటిన తరువాతే చేపలను పట్టడం జరుగుతుంది. దీంతో 2 వేలు పిల్ల వేస్తే ఎకరాకు 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. చెరువు లోతును బట్టి పిల్ల వెయ్యడం, దిగుబడి హెచ్చు తగ్గులుంటాయి.

ప్రతికూలతలూ ఉన్నాయి..

కొంతమంది ఖర్చు తగ్గించుకోవడానికి పండుగొప్పకు రొయ్యల తలకాయ మేతగా ఉయోగిస్తున్నారు. దీనితో చేప నాణ్యత తగ్గుతుందని, దూర ప్రాంతం వెళ్లిన చేప రంగు మారిపోతుందని రైతులు చెబుతున్నారు. అంతే కాకుండా శంఖుజలగ వ్యాధి వ్యాపించి మార్కెట్ పడిపోతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, రొయ్యల తలకాయల అక్రమ రవాణా, కొంతమంది అవగాహన లేని రైతులతో పండు చేప సాగుకు ముప్పు వాటిల్లుతోంది. అధికారులు నిఘా పెట్టి నాణ్యమైన మేతను మాత్రమే ఉపయోగించి సాగు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి గ్యారంటీ



పండు చేపకు ప్రస్తుత ధర రైతులకు లాభదాయకం. 15రోజులు క్రితం రూ.370 వున్న ధర ప్రస్తుతం 430 రూపాయలకు పెరిగింది. రెండేళ్ల నుంచి అనేక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుత ధర నిలబడితే తేరుకుంటాం. 15 ఏళ్లుగా పండు చేప సాగు చేస్తున్నాను. ఎకరంతో సాగు ప్రారంభించి 15 ఎకరాల వరకు సాగు చేస్తున్నాను. పెట్టుబడికి గ్యారంటీ, ఖర్చులు లభిస్తాయి.

\- వీరబాబు పండుచేప రైతు